# మళ్ళీ ఎన్నికలెప్పుడు?

అంతరాత్మ వద్దన్నా వినకుండా ఎన్నికల్లో పోటీ చేసిన అతను గెలిచాడా?

ఆర్. తారా బాలకృష్ణ కధ

హలో, హలో, ముఖ్యమంత్రిగారున్నారా? నేను నీలకంఠాన్ని మాట్లాడుతున్నాను. ఎన్నికల్లో నిల్చుని ఓడిపోయాను. మాడండి.మళ్లీ ఎన్నికలెప్పుడు పియ్యేగారు ప్లీజ్ ఒక్కసారి మంత్రిగారికి ఫోనివ్వండి. బ్రతిమాలాడు నీలకంఠం. అవతలినుండి పియ్యేగారి కంఠం ఖంగుమంది. నిన్నగాక మొన్న ఎన్నికలయ్యాయోలేదో. ఆ సందడి సద్దుమణగక ముందే మళ్లీ ఎన్నికలెప్పుడని అడగడానికి నీకు సిగ్గులేదయ్యా ఫోన్ పెట్టెయ్ .

మరో మాటకు అవకాశం ఇవ్వకుండానే అవతలివైపు ఫోన్ పెట్టేసిన శబ్దం విని నీరుగారిపోయాడు నీలకంఠం.

అసహనంగా అటూ, ఇటూ పచార్లుచేస్తూ కనిపించిన వాళ్లందరి మీద తన కోపం ప్రదర్శిస్తూ సిగరెట్ ప్యాకెట్లన్నీ ఖాళీచేస్తున్నాడు.

బాబుగారు భోజనానికి రండి అంది వంట మనిషి రత్తాలు. నాకాకలిగాలేదు. నువ్వెళ్లు విసుగ్గా అన్నాడు. వంటమనిషేకాదు. ఇంటి మనిషిగా అతని అవసరాలన్నీ చూసుకుంటుంది రత్తాలు. చెరువుమీద అలిగితే చెడేదెవ్వరు తర్వాత మీకే ఆకలవుతుందిలే అని మనస్సులో గొణుక్కుంటు తనింటికెళ్లిపోయింది రత్తాలు.

అయ్యగారు ఫోన్ అంటూ అతని రైట్ హ్యాండ్ రాజేశం ఫోన్ పట్టుకుని నిల్చున్నాడు. ఏం ఫోనోలెండీ సానుభూతి పరామర్శ తప్ప ఇంకేముంటుంది. ఎవరో కనుక్కో అన్నాడు కదలకుండానే నీలకంఠం. సొంటయ్యట అతనూ మీలాగే ఓడిపోయాడు లెండి.



అలాగ అయిత ఇలా ఇవ్వు. ఇద్దరూ ఏడ్చినంత ఇదిగా మాట్లాడుకుని గెల్చినవారిని తిట్టుకుంటూ ఫోన్ పెట్టేసాడు నీలకంఠం. అతని కందరి మీద కసిగా ప్రతి వస్తువును పగులగొట్టాలన్న పిచ్చి కోపంగా వుంది.

అయిదుసంవత్సరాల కొకసారి ఎన్నికల్లో నిల్చుని, కాదు, కాదు రెండు సంవత్సరాల

కొకసారి నిల్చుని ఓడిపోవడమేకాని గెలిచే ప్రసక్తేలేదు. ప్రచారం కోసం ప్రతిసారి బోల్డు డబ్బు తగులేసుకుంటూ చిత్తుగా ఓడిపోయి తర్వాత మత్తుగా తాగి ఆ బాధ తగ్గించుకోవడం. మళ్ళీ ఎన్నికల కోసం నిరీక్షించడం నీలకంఠానికి పరిపాటైపోయింది. నిల్చునే ఓపికలేక కుర్చీలో కూలబడి ఆలోచించడం మొదలెట్టాడు ఏం ఆలోచించుతావులే ఓడిపోయాక అంది అంతరాత్మ.

ఛ వూరుకో మళ్ళీ గెలుస్తానన్నాడు అతను. నిన్నెవరు ఎన్నుకోరు నీ పార్టీ అంటే ఎవరికీ నచ్చదులే అంది నవ్వుతూ. నా పార్టీ మీద నాకు నమ్మకముంది. మళ్ళీ తప్పక గెలుస్తానన్నాడు ధీమాగా.

నీ మొహం నీ పార్టీ మీద నీకు నమ్మకముందేమో కాని ప్రజలకే నీమీద నమ్మకంలేదు అంది. ఇప్పుడు ప్రజల మీదే నాకు నమ్మకంలేదన్నాడతను. నేను నమ్మిన ప్రజలు నన్ను మోసంచేసారు. నేను వెళ్ళి అడిగినప్పుడు అడిగాను అనకు అర్థించాను అను. మళ్ళీ నవ్వింది అంతరాత్మ.

అబ్బా ఏదో ఒకటిలే. అలా అడిగినప్పుడు సరే అంటూ సంతోషంగా ప్రతి నమస్కారం చేస్తూ వాళ్ళ ఓటు నాకేనని చెప్పారు. చెప్పింది నాకు వేసింది నా ప్రత్యర్థికి. అందుకే ప్రజలంటే నాకు అసహ్యం వేస్తూ ఆగ్రహాన్ని అణచుకోలేకపోతున్నాను.

కోపంగా అంటున్న నీలకంఠాన్ని చూసి లోపలున్న అంతరాత్మ పకపకనవ్వింది. నీ ఆగ్రహం ప్రజల మీద చూపించుతే నీకు దక్కేది ఓట్లుకాదు పోట్లు ఇలా పడిగాపులు. ఆ ప్రజలే గెలుపు, ఓటమికి కారకులని మర్చిపోకు అంది ఆవేశంగా.

అక్కడే కూర్చుంటే అంతరాత్మ అలాగే పీడిస్తుందని లేచి బెడ్‌రూంలోకెళ్తే, మెత్తని యూఫోమ్‌బెడ్ ముళ్ళ పానుపులా వుంది. కళ్ళు మూసుకుంటే ఎన్నికల హడావుడే కనిపిస్తూ నిద్రరావడంలేదు నీలకంఠంకు. కడుపులో ఆకలిగాలేదు కాని నీరసంగా అన్పిస్తుంటే లేచి మంచినీళ్ళు తాగి మళ్ళీ వచ్చి పడుకున్నాడు. ఆలోచనలు అల్లుకున్నాయి.

నిన్నటివరకు ఎన్నికల గురించి కన్నకలలన్నీ కల్లలైపోయాయి. మంత్రి పదవిలో ముఖ్యమంత్రి పక్కన కూర్చుంటానని మురిసిపోయిన నీలకంఠం ముచ్చట నిన్నటితోనే ముగిసింది. అరగంటకొకసారి వార్తల్లో అతని ఓటమి స్పష్టంగా అర్థమవుతుంటే గుండెగుబ, గుబలాడుతూ లేని గంభీరాన్ని తెచ్చుకుని టీవీ చూస్తూ కూర్చున్నాడు. మధ్యాహ్నం వార్తల వరకే అతని ముఖం మాడిపోయింది. మనసులో మబ్బులు ముసురుకున్నాయి. ప్రజల మీద పెట్టుకున్న నమ్మకం వమ్మువుతుంటే గీతోపదేశం చెవిలో గింగురుమంటుంది. ఎవరికి ఎవరు అంతా మిథ్యా అనే వేదాంతంతో విచారంగా నిట్టూర్చాడు.

నమ్మిన ప్రజలంతా కక్షగట్టి ఓడించారు. ఓడిన తన బాధలో పాలుపంచుకోడానికెవరున్నారు నిన్న మొన్న తన చుట్టూ తిరిగిన వాళ్ళంతా నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు. పదవి వుంటేనే పరపతి అని ప్రతిమనిషికి తెలుసు. మళ్ళీ కొన్నాళ్ళవరకు ఎన్నికలుండవని తెలిసి కూడా అతని మనస్సు వూరుకోక ముఖ్యమ

మంత్రితో మాట్లాడాలనే ఆరాటాన్ని అణచుకోలేక దిగ్గునలేచి ముఖ్యమంత్రి ఫోన్ డయల్ చేసాడు. అవతలి నుండి హలో అన్నాడు పియ్యే. మళ్లీ నువ్వేనా! బాబు మంత్రిగారున్నారా! అడిగాడు. వుండటంచే విశ్రాంతితెస్తారయ్యా పడుకున్నారు జలుబు చేసింది. ఎన్నికల ఫలితాల్లో ఆయన మునిస్కా కూడా వూడిపోయేలా అయినా, ఇటూ వూగుతుంది తెలుసా! పూర్తిగా వూ(డి)డి పోయిన ఆశ్చర్యపడాల్సింది లేదులే. అందుకే ముసుగుతన్ని పడుకున్నారు. ఎవ్వరితో మాట్లాడటంలేదు. నువ్వు కూడా హాయిగా రెస్టు తీసుకోక ఎందుకీ హైరానా. నిన్నటి వరకు చాలా కష్టపడ్డావుగా పాపం. వెటకారంగా అంటున్న పియ్యే మాటలకు ఎలుగెత్తి ఏడ్వాలన్నంత బాధయింది నీలకంఠానికి. మాటమాటాడక ఫోన్ పెట్టేసి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

ఎడతెరిపిలేని ఆలోచనలు చెదల్లా తొలిచేస్తున్నాయి. తను నిల్చున్న పార్టీ బలం తగ్గుతుందని ముందే అనుకుంటే అపోజిషన్ పార్టీలోనే చేరి నెగ్గేవాడు. వూహించని పరిణామంతో తన పార్టీ ఓడిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అనవసరం. ఆడదైతే బోరున ఏడ్చే పరిస్థితి. మగాడు కాబట్టి మౌనంగా రోధిస్తూ పడుకున్న నీలకంఠం గదిలోకి అతని రైట్‌హ్యాండ్ రాజేశం వచ్చి లైట్ ఆఫ్ చేసి తలుపులు దగ్గరగావేసి వెళ్లిపోతూ "మళ్ళీ ఎన్నికలెప్పుడో?" అంతవరకు అయ్యగారి వాలకం ఇదే పాపం అనుకున్నాడు సానుభూతిగా.

*

# లెక్కలు నేర్చిన కుక్క



జర్మనీకి చెందిన ఒక సర్కస్ కంపెనీలో పనిచేస్తున్న 'లిలీ' అనే కుక్కకు సర్కస్ బేలెన్సింగ్ ఫీట్స్‌తోపాటు కాస్తంత గణిత జ్ఞానం కూడా ఉంది. పలకపై మీరేదైనా నెంబర్ వేశారనుకోండి ఆ నెంబర్‌ను చూసి ఆ నెంబర్ ఎంతో అన్నిసార్లు తన కాలును నేలమీద కొడుతుంది. ఒకటినుండి తొమ్మిది వరకు గల అంకెలతో కూడిన ఒక అంకె కూడికలు, ఒక అంకె తీసివేతలు మీరు బ్లాక్‌బోర్డుమీద వేస్తే వాటి ఫలితాన్ని నేలపై కాలుతో కొట్టడంద్వారా మీకు తెలియజేస్తుంది. *7–2?* అని మీరు రాస్తే *5* అని ఇట్టే కొట్టి చెప్పేస్తుంది. కుక్కకు లెక్కలు రావడం విచిత్రమే కదూ!

—రజనీ శకుంతల (సికిందరాబాద్)